RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :211 EDITOR: CHERUKU UPENDAR, DATE : SATURDAY 16 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 211 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 16 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## పౌరసరఫరాలపై మంత్రి సమీక్ష



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** త్వరలో మహాలక్ష్మి పథకం కింద రూ.500కు వంట గ్యాస్ సిలెండర్ ఇచ్చే అంశంపై ఉన్నతాధికారులతో పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. శుక్రవారం సచివాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరణ, రేషన్ లబ్దిదారులకు నాణ్యమైన బియ్యం సరఫరా తదితర అంశాలపై చర్చించారు.

## దద్దరిల్లిన పార్లమెంట్

### - భద్రతా ఉల్లంఘనలపై చర్చించాలి
### - సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసన

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు:** ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ దద్దరిల్లింది. భద్రత ఉల్లంఘనలపై చర్చించాలని, దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. దీంతో ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి. మరోవైపు సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా మిగిలిన ప్రతిపక్ష ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి ప్రకటనకు పట్టుబడుతున్న ఎంపీలు వెనక్కి తగ్గకపోవడంతో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. సభ ప్రారంభమైన సెకన్లలోనే వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ మళ్లీ సెకన్లలోనే సోమవారానికి వాయిదా

మిగతా 2లో





### అప్పుల్ని.. తప్పుల్ని
## ఎత్తి చూపిన గవర్నర్
### బీఆర్ఎస్ వైఫల్యాలపై దాడి..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం చేసిన ప్రసంగం ఆద్యంతం గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపింది. ఆ సర్కార్ చేసిన అప్పుల్ని.. అప్పటి తప్పుల్ని ఏకరువు పెడుతూ ఆమె మాట్లాడారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నిర్దిష్ట సమయంలో అమలు చేస్తుందంటూ హామీనిచ్చారు. శాసనసభ, మండలి సభ్యులనుద్దేశించి ప్రసంగించేందుకు అసెంబ్లీకి విచ్చేసిన గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎస్

మిగతా 2లో

# ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగాలు

- ఆరునెలల్లో మెగా డీఎస్సీ.. ■ పౌరహక్కుల, ప్రజాస్వామ్య పాలనకు నాంది
- 48 గంటల్లోపే రెండు హామీలు అమలు ■ మిగిలినవీ వందరోజుల్లోపే నెరవేరుస్తాం
- కాళేశ్వరం అవినీతిపై విచారణ ■ ఇంటి నిర్మాణాలకు పేదలకు రూ.5 లక్షలు ఇస్తాం
- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

శుక్రవారం అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి **గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్** ప్రసంగించారు. శాసనసభాపతి, శాసనమండలి చైర్మెన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలిపారు. 2023 తెలంగాణ ప్రస్థానంలో మంచి మార్పునకు శ్రీకారం చుట్టిన ఏడాదిగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. కొత్త ప్రభుత్వం..కొత్త సంవత్సరంలో రైతులు, యువత, మహిళలు, పేదల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపుతుందనీ, ప్రజలకు స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనకు శ్రీకారం చుడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులే తప్ప

మిగతా 2లో

తమ బతుకుల్లో గొప్ప మార్పు రావాలని కోరుకున్న తెలంగాణ ప్రజలు ఇటీవల ఎన్నికల్లో విస్పష్టమైన తీర్పు ఇచ్చారు. వారి విజ్ఞతను నేను అభినందిస్తున్నాను. నా ప్రభుత్వంలో తెలంగాణ స్వేచ్ఛా వాయువులను పీల్చుకుంటున్నది. నియంతృత్వ పాలన, పోకడల నుంచి తెలంగాణ విముక్తి పొందింది. ప్రజాతీర్పు పౌరహక్కులకు, ప్రజాస్వామ్య పాలనకు నాంది అయ్యింది. పాలకులకు, ప్రజలకు మధ్య ఉన్న ఇనుప కంచెలు తొలగిపోయాయి. అడ్డుగోడలు, అద్దాల మేడలు పటాపంచలై ప్రజా ప్రభుత్వ ప్రస్థానం మొదలైందని చెప్పడానికి గర్విస్తున్నాను' అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు.




### వేసవిలో నీటి ఎద్దడి
## రాకుండా చూడండి
### - మిషన్ భగీరథ శాఖ సమీక్షలో మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రవ్యాప్తంగా వేసనికాలంలో తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. క్రమం తప్పకుండా సరఫరా జరిగేలా జాగ్రత్తలు అవసరమని సూచించారు. నిరంతర పర్యవేక్షణ చేయాలని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో మంత్రి సీతక్క సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షించాలనీ, ప్రతి మారుమూల గ్రామానికి రోజువారీ నీటి సరఫరా జరిగేలా చూడాలని ఇంజినీర్లను కోరారు. అనంతరం మేడారం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. త్వరలో మేడారం జాతరపై సంబంధిత శాఖలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. రిజర్వాయర్లు, నదుల తదితర తాగునీటి వనరుల స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి మట్టాలు

మిగతా 2లో



## హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా..
### - ఆమ్రపాలి బాధ్యతలు స్వీకరణ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో జాయింట్ మెట్రోపాలిటన్ జాయింట్ కమిషనర్‌గా ఆమ్రపాలి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ ఉద్యోగుల సహకారంతో మరిన్ని కొత్త ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు చేసే అవకాశం ప్రభుత్వం తనకు కల్పించిందన్నారు. అనంతరం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఆమ్రపాలి బాధ్యతలు చేపట్టి కార్పొరేషన్ అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ కార్యదర్శి చంద్రయ్య, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్, ఎస్టేట్ ఆఫీసర్ కిషన్ రావు, ప్లానింగ్ డైరెక్టర్లు విద్యాధర్, శ్రీనివాస్, లీగల్ స్పెషలిస్ట్ యశస్వి సింగ్‌తో పాటు హెచ్ఎండీఏ అధికారులు, సిబ్బంది జాయింట్ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి అభినందించారు.



### సబ్ ఇన్‌స్పెక్టర్‌గా
## ఏడేండ్ల బాలుడు
### క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి
### - అతని కోరిక తీర్చిన మేక్ ఏ విష్ ఫౌండేషన్, బంజారాహిల్స్ పోలీసులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

క్యాన్సర్‌తో బాధపడుతున్న ఏడేండ్ల బాలుడి పోలీసు కావాలనే కోరికను మేకే ఏ విష్ ఫౌండేషన్, బంజారాహిల్స్ పోలీసులు తీర్చారు. వివరాల్లోకెళ్తే.. ఏపీలోని గుంటూరుకు చెందిన అనుపోజు బ్రహ్మం-లక్ష్మి దంపతుల రెండో కుమారుడు మోహన్ సాయి 4వ తరగతి పూర్తి చేశాడు. గతేడాది సెలవుల్లో అతను అనారోగ్యానికి గురవ్వడంతో వైద్య పరీక్షలు చేయించగా అతనికి క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. సంవత్సర కాలంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో బాలుడు చికిత్స పొందుతున్నాడు. అయితే బాలుడికి పోలీసు అధికారి కావాలన్న కోరిక ఉందని తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న ఆస్పత్రి సిబ్బంది.. మేక్ ఏ విష ఫౌండేషన్ సభ్యులకు చెప్పారు. వారు బాలున్ని శుక్రవారం బంజారాహిల్స్ పోలిస్ స్టేషన్‌కు తీసుకొచ్చి అక్కడి అధికారులకు విషయాన్ని చెప్పారు. దాంతో అక్కడి సిబ్బంది పోలీస్ డ్రెస్‌లో ఉన్న మోహన్‌సాయిని సాదరంగా ఆహ్వానించి సబ్ ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చోబెట్టారు.

మిగతా 2లో

## సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఏడేండ్ల బాలుడు

(మొదటిపేజీ తరువాయి)

బంజారాహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్ చిన్నారికి పోలీసు గౌరవ వందనం చేసి, చిన్నారి నుంచి కూడా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అడ్మిన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్ చిన్నారికి పోలీస్ స్టేషన్‌లో జరిగే పని విధానం గురించి వివరించారు. అలాగే సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఇతర సిబ్బంది బహుమతులను అందజేశారు. బంజారాహిల్స్ పోలీసులు అతని కోరిక నెరవేర్చడంతో బాలుడు ఆనందం వ్యక్తం చేశాడు. తన కోరికలు నెరవేర్చుకోవడానికి అహర్నిశలూ కృషి చేస్తానని తెలిపాడు.

## వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడండి


(మొదటిపేజీ తరువాయి)

తగ్గినప్పుడల్లా ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలు రాకుండా చెప్పారు. ఇందుకోసం ఎప్పటికప్పుడు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని అన్నారు. భగీరథ ప్రాముఖ్యతపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచారం చేయాలనీ, ఇందుకోసం ఏర్పాట్లు చేయాలని సీఈలు, ఎస్ఈలకు సూచించారు. సమీక్ష దాదాపు మూడు గంటలపాటు జరిగింది. అంతకుముందు మిషన్ భగీరథ కార్యదర్శి స్మీతా సభర్వాల్ మంత్రి సీతక్కకు భగీరథ ప్రాజెక్టు, నీటి సరఫరా తదితర అంశాలపై వివరంగా చెప్పారు. ఈసంరద్భంగా మంత్రి సైతం తనకున్న సందేహాలను నివృత్తిచేసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం. కపాకర్ రెడ్డి, సీఈలు విజరుప్రకాశ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య ట్రస్ట్ కు 3 వేల కోట్ల మిగులు నిధులు

**లక్నో - ప్రభాత సూర్యుడు :** ఉత్తర్‌ప్రదేశ్ లోని అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రామమందిర ప్రాణప్రతిష్ఠకు గడువు సమీపిస్తుండటంతో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెలా చివరి నాటికి గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణ పనులు పూర్తవుతాయని రామాలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా వెల్లడించారు. గుడి నిర్మాణానికి, భక్తులకు సౌకర్యాల కల్పనకుఇప్పటి వరకు రూ.900 కోట్లకు పైగా ఖర్చు చేశామని అయోధ్య ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవగిరి వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు ఇచ్చిన విరాళాలతో ట్రస్టుకు కుబేరుని ఆశీర్వాదం ఉందన్నారు. తమ వద్ద ఇంకా రూ.3 వేల కోట్ల మిగులు నిధులు ఉన్నాయిని తెలిపారు. ప్రతి ఏటా శ్రీరామనవమి రోజున గర్భగుడిలోని విగ్రహాలపై సూర్యకిరణాలు నిరంతరాయంగా ప్రసరించేలా ఆలయం శిఖరంపై ఓ ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. నిపుణుల పర్యవేక్షణలో బెంగళూరులో ఈ నిర్మాణాన్ని రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూర్కీ, పుణెలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా అందిస్తోంది. జనవరి 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివస్తారని ఆలయ ట్రస్టు భావిస్తోంది. భక్తుల సౌకర్యార్థం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అయోధ్యలో వేర్వేరుచోట్ల 10 పడకల ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నారు. ప్రాణప్రతిష్ఠ సమయంలో 12 వేల నుంచి 15 వేల మంది అయోధ్యలో బస చేసేందుకు వీలుగా ఆలయ ట్రస్టు ఏర్పాట్లు చేస్తోంది. సాధువులు సహా తాము ఆహ్వానించిన ప్రముఖులందరికీ అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నాం. వేర్వేరు బృందాలకు ఈ బాధ్యతలు అప్పగించాం అని వివరించారు. జనవరి 22న ఆలయ ప్రారంభోత్సవం జరగనుంది. జనవరి 20- 24 మధ్య జరిగే విగ్రహా ప్రాణప్రతిష్ఠ, ప్రారంభోత్సవ వేడుకలకు ప్రధాని మోడీ కూడా హాజరవుతారు. అయితే ప్రధాని ఏ రోజున స్వామివారి సేవలో పాల్గొంటారన్న అంశంపై ప్రధాని కార్యాలయం స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సి ఉంది. అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరాన్ని సందర్శించే భక్తులు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జన్మభూమి కాంప్లెక్స్‌లో మరో 7 ఆలయాలను దర్శించుకోవచ్చు. ఇక ఈ కార్యక్రమంలో పాల్గొనాలని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పోస్టు ద్వారా అందరికీ ఆహ్వానాలు పంపుతున్నారు. దీనికి ముఖ్య అతిథిగా ప్రధాని మోడీ వస్తున్నారు. ఆయనతో పాటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. వీరితో పాటు పలువురు ప్రముఖులకు ఆహ్వానాలు పంపుతున్నారు. జాబితాలో సినీరంగం నుంచి అమితాబ్ బచ్చన్, అక్షయ్ కుమార్ తో పాటు ఇతర ప్రముఖులు ఉన్నారు. అలాగే పారిశ్రామిక రంగం నుంచి రతన్ టాటా, ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ లాంటి ప్రముఖులు, భారత్ క్రికెట్ రూపురేఖలు మార్చిన దిగ్గజ క్రికెటర్లలో సచిన్, విరాట్ కోహ్లి లాంటి ప్రముఖులకు ఆహ్వానాలు అందినట్లు తెలుస్తోంది. ఏడు ధ్వజ స్తంభాల బరువు సుమారు 5,500 కిలోలు. రామమందిరం చుట్టూ 800 మీటర్ల పొడవున నిర్మిస్తున్న రింగ్ రోడ్డు చివరి దశలో ఉంది. మరోవైపు ప్రాకారాలలో నుంచే కాకుండా రింగ్‌రోడ్డు మార్గం నుంచి కూడా ఆలయాన్ని సందర్శించవచ్చు. ఆలయంలోని నేలను పాలరాతితో తీర్చిదిద్దుతున్నారు. 60 శాతం మేరకు ఫ్లోర్‌లో మార్బుల్‌ను అమర్చారు.

## కీలక శాఖలలో ఫైళ్ల గల్లంతును తీవ్రంగా పరిగణించిన తెలంగాణ ప్రభుత్వం



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ప్రభుత్వం మారిన తర్వాత కొన్ని శాఖలలో ఫైళ్ల గల్లంతు లేదా ధ్వంసం ఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఫైళ్ల గల్లంతు, ధ్వంసం ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఫైళ్ల నిర్వహణపై ముఖ్య కార్యదర్శులు, శాఖాధిపతులకు విధివిధానాలను జారీ చేసింది. శాఖల వారీగా ఫైళ్ల వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. ఫైళు మాయమైతే సంబంధిత అధికారులపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఫైళ్ల నిర్వహణపై ఈ నెల 18వ తేదీలోగా నివేదిక ఇవ్వాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

# దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

పడింది. భద్రతా ఉల్లంఘనపై 23 నోటీసుల తిరస్కరణ మరోవైపు రాజ్యసభలో కూడా ప్రతిపక్ష ఎంపీలు ఇదే అంశంపై చర్చకు డిమాండ్ చేయడంతో ఛైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘనపై చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన 23 నోటీసులను రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. దీంతో ఎగిసిన నిరసనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. శుక్రవారం సభ ప్రారంభమైన వెంటనే పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన కారణంగా తలెత్తిన "తీవ్రమైన పరిస్థితి"కి సంబంధించి తనకు 23 నోటీసులు వచ్చాయని ఛైర్మెన్ సభకు తెలియజేశారు. ఘటనపై విచారణ జరుగుతోందని, దాన్ని ముగింపునకు తీసుకెళ్తామని ధన్ ఖర్ చెప్పారు. "నోటీసులను అనుమతించను" అని అన్నారు. ఇది ప్రతిపక్ష పార్టీల నిరసనకు దారితీసింది. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తన ఛాంబర్‌లో సమావేశానికి ఆహ్వానించారు. సమావేశమైనప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనబడలేదు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభమైన సభ ప్రతిపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. దీంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

### సస్పెన్షన్‌కు గురైన ఎంపీల నిరసన

ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలోగల మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట సస్పెన్షన్‌కు గురైన ఎంపీలతో సహా ప్రతిపక్ష ఎంపీలు నిరసనకు దిగారు. మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు చేబూని మౌన నిరసన చేపట్టారు. అనంతరం పార్లమెంట్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో సోనియా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఉభయ సభల ప్రారంభానికి ముందు ఇండియా ఫోరం ఎంపీలు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో భేటీ అయ్యారు. ఉభయ సభల్లో ఉమ్మడి వ్యూహంపై చర్చించారు. ఉభయ సభల్లో ఆందోళనలు కొనసాగిచాలని తీర్మానం చేస్తూ ముందుకు వెళ్లాలని ప్రతిపక్షాలు నిర్ణయించుకున్నాయి.

హౌంమంత్రి పార్లమెంట్‌లో ప్రకటన చేయకుండా టీవీలో ఇంటర్వ్యూ ఇస్తున్నారు: మల్లికార్జున్ ఖర్గే

భద్రతా ఉల్లంఘన అంశంపై కేంద్ర హౌంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన ఇవ్వకుండా టీవీ ఛానళ్లకు ఎందుకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. పార్లమెంట్ ఉల్లంఘనపై ప్రశ్నలు అడిగిన ఎంపీలను చట్టవిరుద్ధంగా సస్పెండ్ చేయడం న్యాయమా? అని అడిగారు. "పార్లమెంట్, దాని ఎంపీల భద్రతలో భారీ లోపానికి కారణమైన ప్రతిపక్ష ఎంపీలను అక్రమంగా సస్పెండ్ చేయడం ఏం న్యాయం" అని ఖర్గే ప్రశ్నించారు. "అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటన ఇవ్వాలని, ఆపై ఉభయ సభలలో చర్చించాలని ఇండియా ఫోరం పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి" అని అన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన ఈ తీవ్రమైన సమస్యపై స్వరం పెంచడం తమ కర్తవ్యమని, ఇది తమ పార్లమెంటరీ బాధ్యతని ఖర్గే పేర్కొన్నారు.

డీఎంకె నేత టిఆర్ బాలు మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఉభయ సభలలో నిరసనలను కొనసాగించాలని, సస్పెన్షన్‌కు గురైన ఎంపీలకు సంఘీభావంగా ఆందోళనలు చేయాలని అన్నారు. అలాగే వారికి మద్దతుగా చేసే ఆందోళనల్లో మనల్ని కూడా సస్పెండ్ చేసినా వెనక్కి తగ్గకూడదని, ఎంత మందిని సస్పెండ్ చేసినా ఆందోళనలు కొనసాగించాలి అన్నారు.

శివసేన (యుబిటి) ఎంపీ అరవింద్ సావంత్ పార్లమెంటు భద్రతా ఉల్లంఘనపై మాట్లాడుతూ "పాస్‌లు ఇచ్చిన ఎంపీ ప్రతిపక్షానికి చెందిన వారైతే బీజేపీ అదే స్థాయిలో సామరస్యాన్ని ప్రదర్శించి ఉండేదా? వారికి ఈ చరిత్ర ఉంది. గుట్టల కొండను తయారు చేయడంలో నైపుణ్యం ఉంది. వాస్తవమేమిటంటే సభకు వచ్చి మాట్లాడాల్సిన బాధ్యత హౌంమంత్రిపై ఉంది. ఆయన రారు, ప్రధాని కూడా రారు" అని విమర్శించారు.

లోక్‌సభ నుంచి సస్పెన్షన్‌పై డీఎంకె ఎంపీ కె. కనిమొళి మాట్లాడుతూ.. 'దేశాన్ని కాపాడేది తామేనని బీజేపీ పదేపదే చెబుతోంది. కానీ పార్లమెంట్‌ను కూడా రక్షించలేరని రుజువైంది. ప్రధాని లోపల ఉండి ఉంటే%ాా% పార్లమెంటును.., తమ సొంత ప్రధానిని కాపాడుకోలేని వారు సమస్యను రాజకీయం చేస్తున్నామని మమ్మల్ని అంటున్నారు. దేశంలో ఎక్కడైనా భద్రతకు విఘాతం కలిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని అన్నారు.

సస్పెన్షన్‌కు గురైన కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ మాట్లాడుతూ.. ' ఇండియా ఫోరానికి చెందిన ఎంపీలంతా ఒక్కటయ్యార' గురువారం మమ్మల్ని అప్రజాస్వామికంగా సస్పెండ్ చేశారు. గాంధీ విగ్రహం ముందు మౌన దీక్ష చేస్తున్నాం. నిరసన కొనసాగిస్తాం. సమస్యను పార్లమెంట్‌లో ఇండియా ఫోరం నేతలు లేవనెత్తుతూనే ఉంటారు" అని అన్నారు.

పార్లమెంటరీ భద్రతా ఉల్లంఘన ఘటనపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ "స్పీకర్ ఏ ఆదేశాలు ఇచ్చినా, ప్రభుత్వం వాటిని అక్షరాలా పాటిస్తోంది. ఈ అంశం కోర్టులో కూడా ఉంది. ఉన్నత స్థాయి విచారణ జరుగుతోంది. వారు ( ప్రతిపక్షం) బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి" అని అన్నారు.

# అప్పుల్ని.. తప్పుల్ని ఎత్తి చూపిన గవర్నర్

శాంతికుమారి తదితరులు ఘన స్వాగతం పలికారు. ఆమెను సీఎం, స్పీకర్, మండలి ఛైర్మెన్ లోపలికి తోడ్కొని వెళ్లారు. అనంతరం గవర్నర్ ప్రసంగిస్తూ%ాా% బీఆర్ఎస్ హయాంలో అన్ని వ్యవస్థలూ విధ్వంసమయ్యాయంటూ తూర్పారబట్టారు. ముఖ్యంగా విద్యుత్, పౌర సరఫరాల శాఖల్లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాల గురించి ప్రస్తావించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోని లోపాలనూ గుర్తు చేశారు. 'దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచటం నా ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్' అంటూ ఆమె భవిష్యత్ గురించి ఆందోళన వ్యక్తం చేయటం కొసమెరుపు. నియంతృత్వ పాలన, నిర్బంధంలాంటి పదాలు గవర్నర్ ప్రసంగంలో చోటు చేసుకోవటం గమనార్హం. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఒకరకంగా చెప్పాలంటే పదేండ్ల తర్వాత కొలువుదీరిన 'కాంగ్రెస్ సర్కార్ ఆత్మ'ను గవర్నర్ తన ప్రసంగం ద్వారా ప్రజల ముందుంచారు. ఆమె స్పీచ్ ఇటు అసెంబ్లీలోనూ, ఇటు బయటా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రజాకవి కాళోజీ నారాయణరావు పలుకులతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్.. మహాకవి దాశరథి పలుకులతో ముగించారు. ఉదయం 11.33 గంటలకు ప్రారంభమైన ఆమె ప్రసంగం.. 20 నిమిషాలపాటు కొనసాగి 11.53 గంటలకు ముగిసింది. అనంతరం సభ శనివారానికి వాయిదా పడింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయ సభల్లో శనివారం చర్చ జరగనుంది.

# ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

పాలకులు కాదు..పెత్తందారులు అంతకంటే కాదని సుస్పష్టంగా చెప్పారు. సామాన్యుడు కూడా ఇది తన ప్రభుత్వం అని చెప్పుకునే ప్రజాపాలన మొదలైందనీ, ఇది దేశానికే ఆదర్శంగా మారబోతున్నందుకు గర్వకారణంగా ఉందని అన్నారు. తెలంగాణ అమరవీరుల ఆశయాలు, విద్యార్థుల పోరాటాలు, పౌర సమాజపు ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ముందుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన యూపీఏ ప్రభుత్వానికి, ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు, యూపీఏ ఛైర్మెన్ సోనియాగాంధీకి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

గ్యారంటీల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చిన హామీలు, చెప్పిన మాటకు కట్టుబడి వాటికి చట్టబద్ధత కల్పించే ఫైలుపై ఆయన సంతకం చేయడం ప్రభుత్వ సంకల్పానికి, చిత్తశుద్ధికి నిదర్శనమని గవర్నర్ ఈ సందర్భంగా కొనియాడారు. 48 గంటల్లోపే రెండు గ్యారెంటీలను అమలు చేయడం గొప్ప విషయమన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత గ్యారెంటీలపై వంద రోజుల్లో కార్యాచరణ తీసుకుంటామని చెప్పారు. పెరిగిన వైద్యఖర్చులు, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సేవలను మరింత విస్తృతపరిచేందుకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం పొందేలా పథకాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు.

### రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలో కార్యాచరణ

వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన, నిరంతర విద్యుత్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ చెప్పారు. రైతు డిక్లరేషన్‌లో ప్రకటించినట్టుగా ప్రతి పంటకూ మద్దతు ధర ఇస్తామని హామీనిచ్చారు. రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు. ప్రజలకు మాటిచ్చినట్టుగానే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన నాణ్యతాలోపం, అవినీతి అవకతవకలపై విచారణ జరిపిస్తామని చెప్పారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా సాధన, దక్షిణ తెలంగాణ వరప్రదాయని అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్లను పూర్తిచేసి ఎగువనున్న ఆదిలాబాద్, ఇతర జిల్లాలకు సాగునీరందించాలనే లక్ష్యం తమ ప్రభుత్వం ముందుందని చెప్పారు. రైతు, ఎస్సీ,ఎస్టీ, యువ, బీసీ డిక్లరేషన్ల హామీలకు అమలు చేస్తామని మాటిచ్చారు.

### ధరణి స్థానంలో భూమాత పోర్టల్..అసైన్డ్, పోడు భూముల పంపిణీ

ప్రజావాణిలో ఎక్కువగా భూ సమస్యలే వస్తున్నాయనీ, ఈ నేపథ్యంలోనే ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తెచ్చి భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని గవర్నర్ హామీనిచ్చారు. ల్యాండ్ కమిషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములకు పరిరక్షించే కార్యక్రమాన్ని తీసుకుంటామని ప్రకటించారు. భూ సంస్కరణల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు పంచిన 25 లక్షల ఎకరాల భూమిపై పేదలకు పూర్తిస్థాయి భూ హక్కులు కల్పిస్తామని భరోసానిచ్చారు. అసైన్డ్, పోడు భూములకు పట్టాలిచ్చే కార్యాచరణను తీసుకుంటామని తెలిపారు.

### యువతకిచ్చిన మాటను నిలబెట్టుకుంటాం

యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని గవర్నర్ తెలిపారు. ఆరునెలల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని హామీనిచ్చారు. ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. జాబ్‌క్యాలెండర్ విషయంలో ఇచ్చిన మాటప్రకారం ముందుకెళ్తామని చెప్పారు. నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకున్న టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం సంతోషకరమన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలమున్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించడానికి ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టిందని గవర్నర్ తెలిపారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు అదనంగా లక్ష రూపాయలిస్తామని వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను గుర్తించి 250 గజాల చొప్పున ఇంటిస్థలం, గౌరవభృతి ఇస్తామని ప్రకటించారు.

### డ్రగ్స్ భూతాన్ని తరిమికొడతాం

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో అత్యంత కఠిన వైఖరి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని గవర్నర్ చెప్పారు. డ్రగ్స్‌భూతాన్ని రాష్ట్ర పొలిమేరలు దాటే వరకు తరిమి కొట్టాలన్న దృఢ సంకల్పంతో తమ సర్కార్ ఉందన్నారు. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించడం శుభపరిణామని చెప్పారు. ఎంతటి ఒత్తిళ్లు వచ్చినా డ్రగ్స్ విషయంలో దోషులను వదిలేది లేదని సభావేదికగా స్పష్టం చేశారు.

తెలంగాణకు పాలనా కేంద్రంగా, ఆర్థికంగా గుండెకాయ లాంటి హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తెలిపారు. మూసీని ప్రక్షాళన చేస్తామన్నారు. ఆ నదీ పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పనా జోన్‌గా మార్చే కార్యాచరణ మొదలు పెట్టామని ప్రకటించారు. మహానగరాన్ని అన్ని దిశలుగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఔటర్ లోపల ఉన్న హైదరాబాద్‌ను, ఔటర్ రింగ్‌రోడ్డు-ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న ప్రాంతాన్ని, ఆర్ఆర్ఆర్ అవల ఉన్న ప్రాంతాన్ని మరోభాగంగా నిర్ధారించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు.

## సంపాదకీయం

### హస్తభూషణం నుంచి కర్ణభూషణం వరకు

కాలం చేసే తమాషాలు....పుస్తకం హస్తభూషణం అనేది నానుడి... అది చదివే పుస్తకాల గురించి! ఇప్పుడు వినే పుస్తకాలు ప్రాచుర్యాన్ని తెచ్చుకుంటూ కర్ణభూషణంగా మారుతున్నాయి. మన జీవితమూ, ఊహలూ, ప్రణాళికలూ కాలం వెంబడి సరళరేఖలా సాగుతాయనుకుంటాం. కానీ, దృష్టి వైశాల్యాన్ని పెంచుకుని చూస్తే కాలం మళ్ళీ మళ్ళీ బయలుదేరిన చోటికే వచ్చే చక్రంలా కూడా కనిపిస్తుంది. కాలచక్ర నే మాట సర్వత్రా ప్రసిద్ధమే.పుస్తక ప్రపంచంలోకే కనుక ఒకసారి తొంగి చూస్తే, చదువు అనే మాట పుస్తకంతో ముడిపడే ప్రచారంలోకి వచ్చింది. పుస్తకాలు లేని కాలంలో; లేదా, అవి జనసామాన్యానికి విరివిగా అందుబాటులోకి రాని రోజుల్లో కథలూ, కవిత్వాలూ, ఇతరేతర జ్ఞానాలూ అన్నీ వినుకలి ద్వారానే అందేవి. దీర్ఘకాలంపాటు ప్రపంచవ్యాప్తంగా సమస్త వాఙ్మయమూ చక్షురక్షరాల మధ్య కాకుండా; వక్తకీ, శ్రోతకీ మధ్య ప్రవహిస్తూ మౌఖిక వాఙ్మ యమనే ముద్ర వేసుకుంది. పుస్తక వ్యాప్తితోనే లిఖిత సాహిత్యమన్న మాట వాడుకలోకి వచ్చింది. కాలచక్రం మళ్ళీ మొదటికొచ్చి, పుస్తకమనే 'పఠన' మాధ్యమం స్థానాన్ని, ఇయర్ ఫోన్ రూపంలో తిరిగి వెనకటి శ్రవణ మాధ్యమం ఆక్రమించుకుంటున్నట్టు తోస్తోంది. నేటి యువత పుస్తకాన్ని చదవడం కన్నా, వినడాన్ని ఎక్కువ ఇష్టపడుతున్నట్టు కనిపిస్తోంది. ఆ విధంగా, పుస్తకాలు లేని గది ఆత్మలేని దేహ న్న సిసిరో సూక్తిని కొంత సవరించుకోవలసిన అవసరమూ కలుగుతోంది.కనుకలి నుంచి వినుకలికి మారినప్పుడు పుస్తకం కలిగించే అనుభూతి గాఢతలోనూ మార్పు వస్తుందా అన్నది అనుభవంతో మాత్రమే చెప్పగలం. ఏదైనాసరే అంతిమంగా అలవాటు పడడంలోనే ఉంటుంది. మాధ్యమం ఎలాంటిదైనా పుస్తకానికీ మస్తకానికీ పడిన పీటముడి స్థిరమూ, శాశ్వతమనీ మాత్రం నిస్సంశయంగా చెప్పవచ్చు. రాబోయే కాలం అనూహ్యంగా మన అంచనాలను తలకిందులు చేస్తే తప్ప పుస్తకాలతో మన సహజీవనం మరికొన్ని తరాలపాటు నిరాఘాటంగా కొనసాగుతుందనే అనుకోవచ్చు. కాపురంలోలానే పుస్తకాలతో కాపురంలోనూ చేదూ, తీపీ కలగలిసే ఉంటాయి. పుస్తక ప్రియులు వియ్యమందితే ఒక్కోసారి సొంతింటి పుస్తక వారసత్వానికీ, సొంత సేకరణకూ అదనంగా అత్తింటి పుస్తక వారసత్వమూ అంది, పుస్తకాలు ఇబ్బడి ముబ్బడై అల్మైరాలను దాటిపోయి నేల మీద పరచుకుంటూ ఉంటాయి. పుస్తెతోపాటు సంక్రమించిన పుస్తక సంపదా ఇల్లాలికి దినదిన సమస్య అవుతూ ఉంటుంది.పుస్తకాలతో జీవించడం కూడా ఒక పుస్తకానికి సరిపోయే ఇతివృత్త మవుతుంది. బాల్యం నుంచి, వార్ధక్యం వరకూ మనతో ఉండే పుస్తకాలు, ఒక్క పుట కూడా తెరవకుండానే, ఆయా వయోదశల మీదుగా మన అభిరుచులలో వచ్చే తేడాలను బోధిస్తాయి. మనకు పనికిరానివని పక్కన పెట్టిన పుస్తకాలే క్రమంగా మన చదువుల బల్లకెక్కి వెక్కిరిస్తాయి. మన హస్తస్పర్శ కోసం ఏళ్ల తరబడి మౌన తపస్సు చేసే పుస్తకాలే, ఒక్కసారి తెరవగానే అద్భుత ప్రపంచంలోకి మనల్ని లాక్కుపోతాయి. మన ప్రయాణం ఆగినా పుస్తక ప్రయాణం కొన సాగుతూనే ఉంటుంది. కవిత్వానికి ఏదీ అనర్హం కాదని మహాకవి ఉగ్గడించినట్టుగా, చరిత్ర శోధనకూ ఏదీ అనర్హం కాదు. పుస్తక చరిత్రనే తవ్వితే అది కూడా ఎన్నో అవతారాలు ఎత్తుతూ నేటి దశకు వచ్చిన సంగతి అర్థమై రేపటి అవతారం గురించిన దిగులు, గుబుళ్లను తగ్గిస్తుంది. పుస్తకం గురించిన ఊహ క్రీస్తుపూర్వం నాలుగవ సహస్రాబ్ది నాటికే ఉండేది. ప్రాచీన ఈజిప్టు వాసులు మధ్య ఆఫ్రికా, నైలునదీ లోయల్లో పెరిగే పెపారస్ అనే నీటిమొక్క నుంచి తీసిన మెత్తని బెరడును రాతకు, చిత్రలేఖనానికి ఉపయోగించేవారు.ఈ పెపారస్ పేరే పేపర్ గా మారి ఇప్పటికీ వ్యవహారంలో ఉంది. ఆంగ్లంలో బుక్ అనే మాట పుట్టుకా ఇంతే ఆసక్తికరం. యూరప్, ఆసియా అడవుల్లో పెరిగే బచ్ అనే చెట్టు తాలూకు తెల్లని బెరడును రాతకు ఉపయోగించేవారు. నేటి ఇండో?యూరోపియన్ భాషలకు మాతృక అయిన ప్రోటో?ఇండో? యూరోపియన్ లోని భెరెగ్, భగో అనే మాటలే వివిధ పుత్రికాభాషల్లో బచ్ గానూ, బీచ్ గానే కాక; ఇంకా అనేక రూపాంతరాలు చెందుతూ చివరికి బుక్‌గా మారాయి.ప్రాచీన భారతదేశంలో రాతకు ఉపయోగించిన భూర్జపత్ర మనే సంస్కృత శబ్ద మూలాలు కూడా భెరెగ్ అనే ప్రోటో?ఇండో?యూరోపియన్ పదంలోనే ఉన్నాయి. క్రీస్తుశకం తొలి శతాబ్దంలో రోమన్లు శిక్షాస్మృతుల రాతకు గొర్రె, మేక చర్మాన్ని వినియో గించేవారు. క్రమంగా తాటియాకులు, రాగిరేకులు రాతకు ఆలంబనమయ్యాయి. క్రీస్తుశకం 2?5 శతాబ్దుల మధ్యలో వచ్చినట్టు చెబుతున్న డైమెండ్ సూత్ర తొలి ముద్రితగ్రంథమంటారుఇక 15వ శతాబ్దిలో జోహానెస్ గూటెన్‌బర్గ్ కనిపెట్టిన ముద్రణ యంత్రం పుస్తక ప్రచురణను విప్లవీకరించడం, 16వ శతాబ్దిలో రిచర్డ్ ముల్‌కాస్టర్ అనే పండితుడు ఎనిమిదివేల మాటలతో తొలి నిఘంటువును ప్రచురించడం వగైరాలు ఇటీవలి చరిత్ర. ఎప్పటికప్పుడు పరిమిత సంఖ్యలో పుస్తకాలను ప్రచురించుకునే నేటి అవకాశాన్ని (ప్రింట్?ఆన్ ?ఆర్డర్) ఫ్రెడరిక్ ఫో అనే సైన్సు ఫిక్షన్ రచయిత 1966లోనే ఊహించాడు. ఇంతకీ ఈ పుస్తక స్మరణ దేనికంటే, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పుస్తకాల పండుగ సమీపిస్తోంది. కొన్ని రోజులపాటు జరిగే ఈ పండుగకు ముద్రాపకులు, విక్రేతలు, రచయితలు సమధికోత్సాహంతో సిద్ధమవుతున్నారు. ముద్రిత గ్రంథాల భవిష్యత్తు పట్ల ప్రస్తుతానికి అదే కొండంత భరోసా.

## బలవంతంగా కేంద్రాలను తీయొద్దు

**ఉదయగిరి -ప్రభాత సూర్యుడు :**



అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తూ బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరవద్దని సిఐటియు నాయకులు కాకు వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం 4వ రోజు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మోకాళ్లపై నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను దౌర్జన్యంగా తెరవకూడదని సమ్మె చేపట్టే వారిని వత్తులకు గురి చేయరాదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలే అడుగుతున్నామే తప్ప మరొక కోరిక కాదని వెంటనే జరిగే పార్లమెంటు సమావేశంలో అంగన్‌వాడీల సమస్యలు చర్చించి సమస్యను పరిష్కరించాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి అంగన్‌వాడీ కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఈ సమ్మె కొనసాగుతుందన్నారు. భారత్ మజ్దూర్ సంఘ్ నాయకురాలు షేక్ చాంద్ బేగం మద్దతు తెలిపి అంగన్‌వాడీల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ప్రమీల, నాయకులు రమాదేవి, సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీతక్క ఊరికి బస్సు





**వరంగల్ – ప్రభాత సూర్యుడు :**

గిరిజన ప్రాంతాల్లో వసతుల విషయంలో ప్రభుత్వాలు చెబుతున్న గణాంకాలకు.. వాస్తవ పరిస్థితికి అస్సలు పొంతన ఉండదు. ఇప్పటికీ రవాణా కష్టాల్లో బతుకు బండి లాగిస్తున్న గ్రామాలు ఎన్నో ఉన్నాయి. సరైన రోడ్డు ఉండదు. మౌలిక వసతులు సైతం గిరిజనులు ఎరుగరు. ప్రభుత్వాలు మాత్రం అంత సవ్యంగా ఉన్నట్లు చెబుతుంటారు. అయితే ప్రజా ప్రతినిధులు దృష్టిసారించే గ్రామాలు మాత్రం అభివృద్ధి చెందుతున్నాయి.

ఈ కోవలోకి వస్తుంది జగ్గన్నపేట గ్రామం. మొన్నటి వరకు ఆ ఊరు ఎక్కడ ఉందో తెలియ నట్టుగా అధికారులు ఉండగా.. ఇప్పుడు ఉరుకులు పరుగులు పెట్టి ఆ గ్రామం పై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నారు. మంత్రి సీతక్క సొంత గ్రామం కావడమే అందుకు కారణం.ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి సీతక్క గెలుపొందిన సంగతి తెలిసిందే. రేవంత్ క్యాబినెట్లో ఆమె మంత్రి అయ్యారు కూడా. అటు కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని కల్పించిన సంగతి తెలిసిందే. అయితే మంత్రి సీతక్క స్వగ్రామానికి రోడ్డు మార్గం ఉన్నా ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఆర్టీసీ అధికారులు స్పందించారు. రూట్ సర్వే చేశారు. బస్సు నడిపేందుకు నిర్ణయించారు. దీనిపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.సీతక్క విపక్షంలో ఉన్నప్పుడు ఏనాడు ఆర్టీసీ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. చాలాసార్లు బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె అడిగిన అప్పటి ప్రభుత్వం పెద్దగా స్పందించలేదు. ఇప్పుడు సీతక్క మంత్రి కావడంతో స్పందించాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైంది. దీంతో జగ్గన్నపేట గ్రామస్తులు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు తమకు ఉచిత బస్సు సౌకర్యం కలుగ ుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు సౌకర్యానికి విశేష స్పందన లభిస్తోంది. మారుమూల గ్రామీణ ప్రాంతాల వారు సైతం తమ రూట్లో బస్సులు వేయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకుంటోంది.

# శబరిమలలో భక్తుల ఆందోళన

**తిరువనంతపురం – ప్రభాత సూర్యుడు :**

శరణు అయ్యప్పా అంటూ ఆ శబరిగిరీశుని దర్శిస్తే భక్తుల బాగోగులు ఆ స్వామి చూసుకుంటారనీ.. పంపానదిలో స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.. కానీ ఆ స్వామివారి దర్శనానికి వెళ్లిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా భక్తులు రావడం.. అదే సమయం లో అధికారులు, ఆలయసిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ లక్ష మందికి పైగా భక్తులు స్వామి దర్శనానికి వస్తున్నారు. శబరిమలకు భక్తులు పోటెత్తడంతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో...అధికారులు పంబాకు వెళ్లే వాహనాలకు అనుమతి నిరాకరించారు . ఫలితంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు రోడ్డుపైన నిరసనకు దిగారు. ఎరుమెలి– పంబా రోడ్డుపై అయ్యప్ప పాటలు పాడుతూ ఆందోళన నిర్వహించారు. పంబాకు వాహనాలు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని... అయ్యప్ప భక్తులతో ఆందోళనను విరమింపజేశారు. భక్తుల రద్దీ అదుపులోకి వచ్చాక వాహనాలను అనుతిస్తామని హామీ ఇవ్వడంతో భక్తులు వెనక్కితగ్గారు. భక్తుల ఆందోళనలపై కేరళ దేవాదాయ శాఖ మంత్రి కే రాధాకృష్ణన్ స్పందించారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించామన్న ఆయన, భక్తుల కోసం ఆర్టీసీ బస్సులను సైతం వినియోగిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆన్లైన్ సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని యాత్రికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.దీంతో స్వామి దర్శనానికి 18 నుంచి 24 గంటల పడుతోంది. క్యూలైన్‌లో నిరీక్షించలేక పలువురు యాత్రికులు దర్శనం చేసుకోకుండానే వెనుదిరుగుతున్నారు. పందళంలోని వలియకోయికల్ ఆలయానికి చేరుకుని నెయ్యి అభిషేకం చేసి వెనక్కి వెళ్లిపోతున్నారు. దర్శనం చేసుకోకుండా తిరిగి వెళ్లిపోతున్నవారిలో ఏపీ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన భక్తులు ఎక్కువగా ఉన్నారు. ఈ ఘటనపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వంతో మాట్లాడి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారాయన.వారం రోజులుగా శబరిమలలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ట్రావెన్‌కోర్ అధికారులు –పోలీసుల మధ్య సమన్వయ లోపం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదునెట్టాంబడి దగ్గర భక్తులు నెమ్మదిగా కదలడం.. 18 మెట్ల దగ్గర పోలీసులు లేకపోవడం.. కేరళ పోలీసులకు.. దేవస్థానం అధికారులకు సమన్వయం లేకపోవడం వల్లే సజావుగా దర్శనం జరగడం లేదని భక్తులు మండిపడుతున్నారు



# సాధారణ ఎన్నికలను తలపిస్తున్న సింగరేణి ఎన్నికలు

**హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :**

: తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి.. కేసీఆర్ సర్కార్‌ను ఆర్థికంగా ఆదుకున్నది ఈ సంస్థ కార్మికులే. ప్రకృతికి విరుద్ధంగా పనిచేస్తూ నల్లబంగారం వెలికి తీస్తున్న కార్మికులు సంస్థ లాభాలను ఏటా పెంచుకుంటూ పోతున్నారు. కరోనా సమయంలోనూ మంచి లాభాలను ఆర్జించారు. దీంతో సంస్థ ఆదాయాన్ని అప్పుగా తీసుకున్న కేసీఆర్ సర్కార్ వాటిని తిరిగి చెల్లించలేదు. మరోవైపు బొగ్గు కొనుగలు బకాయిలు కూడా భారీగా ఉన్నాయి. దీంతో సింగరేణిలో రెండేళ్లుగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు బీఆర్ఎస్ సర్కార్ భయపడింది. కార్మిక సంఘాల అనేక పోరాటాల తర్వాత ఎట్టకేలకు గుర్తింపు సంఘం ఎన్నికలకు యాజమాన్యం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిసెంబర్ 27న ఎన్నికలు జరగనున్నాయి. దీంతో దాదాపు ఆరేళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కార్మిక సంఘాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. సాధారణ ఎన్నికలను తలపించేలా మేనిఫెస్టోలు రిలీజ్ చేస్తున్నాయి.సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందడి మొదలైంది. ఈ నెల 27న ఎన్నికలు జరగనుండగా అందుకు సంబంధించిన ప్రక్రియ ఊపం దుకుంది. ఈ ఎన్నికల్లో 11 ఏరియాల్లో 39,748 మంది పర్మినెంట్ కార్మికులు ఓటుహకు వినియోగిం చుకోనున్నారు. ఈ ఎన్నికల్లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, బీఎంఎస్, సీఐటీయూ, హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ వంటి సంఘాలు పోటీపడుతున్నా.. ప్రధాన పోటీ మాత్రం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ మధ్యనే కనిపిస్తోంది. ఈసారి ఎన్నికల్లో ప్రస్తుత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌కు భంగపాటు తప్పేలా లేదు. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్?సీపీఐ కూటమి అధికారంలోకి రావడం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలకు ప్లస్ పాయింట్. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పోటీ చేసినా.. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో మాత్రం కలిసి పోటీ చేయడం లేదు. ఇక ఎన్నికల నిర్వహణకు కార్మికశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. పోలింగ్ కోసం వివిధ ప్రాంతాల్లో మొత్తం 84 కేంద్రాలు ఏర్పాటు చేయనుంది.

కార్పొరేట్ ఏరియాలో ఐదు, కొత్తగూడెంలో ఆరు, ఇల్లెందులో మూడు, మణు గూరులో ఏడు, రామగుండం1లో 11, రామగుండం? 2లో ఆరు, రామగుండం 3లో ఆరు, భూపాలపల్లిలో 9, బెల్లంపల్లిలో 5, మందమర్రిలో 11, శ్రీరాంపూర్‌లో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ రోజు రాత్రే ఓట్లను లెక్కిస్తారు. ఇందుకోసం 12 ఓట్ల లెకింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు కార్మికశాఖ తెలిపింది.ఇక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో కార్మిక సంఘాలు ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. భూగర్భ, ఓపెన్‌కాస్టు గనులపై గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నాయి. కార్మికులు ఎక్కువగా ఉండే ఏరియాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తున్నాయి. తాము గతంలో ఏం చేశాము.. ఇప్పుడు గెలిపిస్తే ఏం చేస్తామో వివరిస్తున్నారు. ప్రస్తుత సంఘం టీబీజీకేఎస్ పాలనలో సింగరేణి ఎలా అప్పుల్లో కూరుకుపోయింది. కార్మికుల హక్కులు ఎలా హరిస్తుంది, గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వైఫల్యాలను వివరిస్తున్నారు. దీంతో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం సాధారణ ఎన్నికలను తలపిస్తోంది సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియ ఊపందుకున్నప్పటికీ అసలివి జరుగుతాయా? అన్న సందేహాలు కూడా నెలకొన్నాయి. కొన్ని సంఘాలు కోర్టుకు వెళ్లి ఎన్నికలను వాయిదా వేయించే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆ పార్టీ అనుబంధ సంఘం టీబీజీకేఎస్ గతంలో ఎన్నికల వాయిదాకు అనేక ప్రయత్నాలు చేసింది. తాజాగా గెలిచే అవకాశం లేనందున ఎన్నికలు వాయిదా వేయించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.





## 'మహాలక్ష్మి'కోసం ప్రత్యేక అధికారులను నియమిస్తాం

### -కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :

మహాలక్ష్మి పథకం కోసం ప్రతి నియో జకవర్గానికి ప్రత్యేక అధికారులను నియమిస్తా మని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురి శెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమా వేశ మందిరంలో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తాసిల్దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రతి మంగళ వారం, శుక్రవారం నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాలకు అధికారుల టీంలను నియ మించాలని సూచించారు. ల్యాండ్ బ్యాంక్ జాబితాలను సిద్ధం చేయా లని తహసీల్దారులను కలెక్టర్ ఆదేశించారు. కోర్టు కేసులను త్వరగా పూర్తి చేయాలని, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ కోర్టు కేసు మేనేజే మెంట్ సిస్టంను అభివృద్ధి చేయాలని కలెక్టర్ అధి కారులకు సూచించారు. ఎలినేషన్ ప్రతిపాదనలు తయారు చేయాలని, మీ సేవలో మిగిలి వున్న పనులను త్వరగా పూర్తిచేయా లన్నారు. ఆసరా పింఛన్లకు ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్, బ్యాంక్ ఖాతా లను అనుసం ధానం చేయాలని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబా రక్‌లను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్వో వెంకటాచారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్యూజోన్ మార్ట్ ప్రారంభం

### - ప్రారంభించిన హీరో బాలకృష్ణ




హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

నగరంలోని పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన నూతన వాల్యూజోన్ హైపర్ మార్ట్‌ను శుక్రవారం ప్రముఖ నటుడు బాలకృష్ణ వేడుకగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆ సంస్థకు బాలకృష్ణ బ్రాండ్ అంబా సీడర్‌గా కూడా వ్యవహారిస్తున్నారు. దీనికి పి వెంకటేశ్వర్లు, ఎస్ రాజమౌళి, టి.ప్రసాదరావులు ప్రధానమెంటర్లుగా ఉన్నారు. ప్రారం భోత్సవానికి హాజరైన బాలకృష్ణను చూడటానికి ప్రజలు భారీగా పోగయ్యారు. వ్యాల్యూజోన్ రిటైల్ వాణిజ్య వ్యవస్థలోనే ఒక వినూత్న విప్లవాన్ని తీసుకు రానుందని బాల కృష్ణ అన్నారు. ఇది హైదరాబాద్ నగరానికే గర్వకారణమన్నారు. ఇందులో విస్తృత శ్రేణీకి చెందిన నాణ్యమైన ఉత్పత్తుల్ని, లాభసాటి ధరలకు కొనుగోలు చేయ వచ్చున్నారు. గొప్ప షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవానికి వాల్యూజోన్ డైరెక్టర్లు సురేష్ సీర్ణ, పివిఎస్ అభినవ్, టి.రాకేష్, కేశవ్‌గుప్తా తదితరులు హాజరై మాట్లాడుతూ.. వినూత్న షాపింగ్‌కు తమ సంస్థ చిరునామాగా నిలు వనుం దన్నారు. తమ మాల్‌లోని అసంఖ్యా కమైన బ్రాండ్లపై 40 శాతం వరకు డిస్కౌంట్లను అందించనున్నట్లు, విభిన్నమైన ఆఫర్లు అందుబాటులో ఉంటాయన్నారు. అందుబాటు ధరల్లో వినియోగదారులు మరిన్ని వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రోత్సహించేలా వాతావరణం ఉంటుందన్నారు.

## పొన్నంకు వృత్తిసంఘాల శుభాకాంక్షలు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌కు చేతి వృత్తి సంఘాల సమన్వయ కమిటీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం కృష్ణస్వామి, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లేశం, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అద్యక్షులు సాయిలు తదితరులు మంత్రిని కలిశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో వృత్తి దారులకిచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# భార్యా పిల్లల్ని కడతేర్చి..కలెక్టర్ గన్‌మెన్ ఆత్మహత్య

చిన్నకోడూరు – ప్రభాత సూర్యుడు :

ఆన్ డ్యూటీలో ఉన్న కలెక్టర్ గన్‌మెన్.. ఆర్థిక సమస్యల తో తీవ్ర మనస్థాపానికి గురై తన రివాల్వర్‌తో భార్య, పిల్లలపై కాల్పులు జరిపి ఆపై తానూ అదే పిస్టల్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హృదయ విదారకర ఘటన సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం రాముని పట్ల గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామునిపట్ల గ్రామానికి చెందిన ఆకుల నరేశ్ (35) సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆన్‌లైన్ ద్వారా సులువుగా డబ్బు సంపాదించవచ్చని నమ్మి లక్షల రూపాయలు పెట్టి ఆన్‌లైన్‌లో బెట్టింగులు పెట్టి మోసపోయాడు. తన వ్యవసాయ భూమి అమ్మినా తీరని అప్పులతో కృంగిపోయి ఇబ్బందులు పడుతూ, ఓ వైపు తోటి ఉద్యోగులు ఆర్థికంగా స్థిరపడటం, మరో వైపు బంధువులు చులకన భావంతో చూడటం ఒకింత తీవ్ర మనోవేదనకి గురయ్యాడు. ఇదే విషయమై భార్యభర్తల మధ్య గొడవ జరిగింది.

అది తారాస్థాయికి చేరు కోవడంతో ఆగ్రహానికి గురైన నరేశ్ పాఠశాలకు వెళ్లి పిల్లలను ఇంటికి తీసుకువచ్చాడు. ఆపై కుమారుడు రేవంత్(6), కుమార్తె రిషిత(5)తో సహా భార్య చైతన్య(30)ను తుపాకీతో కాల్చి.. తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సీపీ శ్వేత మీడియాతో మాట్లాడుతూ.. సర్వీస్ రివాల్వర్‌తో కుటుంబ





సభ్యులను నరేశ్ కాల్చి చంపారని వెల్లడించారు. నరేశ్‌కు అప్పులు ఉన్నట్టు ప్రాథమికంగా తెలిసిందని, ఆన్‌డ్యూటీలో ఉండగానే ఈ ఘటనకు పాల్పడినట్టు తెలిపారు. నరేశ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీపీ వెల్లడించారు.

# అన్నీ అసత్యాలే..కొత్తదనం లేదు

### - గవర్నర్ ప్రసంగంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :

గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదనీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను చదివి నట్టుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశం, అరెకపుడి గాంధీ తదితరులతో కలిసి శుక్రవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ లో ఆయన మాట్లాడారు. గత పదేండ్లుగా తెలంగాణ తిరోగమనంలో ఉన్నట్లు గవర్నర్ ప్రసంగించటం విచారకరమన్నారు.

జాతీయ స్థాయిలో అనేక అవార్డులు రాష్ట్రం అందుకున్నదనే విషయాన్ని గవర్నర్ మరిచిపోయారని గుర్తు చేశారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను తలదన్నే విధంగా వరి ఉత్పత్తిలో రాష్ట్రం ముందు నిలిచిందన్నారు. తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది నిజం కాదా? అని ప్రశ్నించారు.ఐటీ ఉత్పత్తులు, ఎగుమతుల్లో హైదరాబాద్ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. గవర్నర్ గతంలో మాట్లాడింది,



ఇప్పుడు మాట్లాడింది సమీక్ష చేసుకోవాలన్నారు. ప్రజలందరూ ఇప్పుడు సంతోషపడుతున్నట్టు మాట్లాడడం సరైంది కాదని చెప్పారు. తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పిలుస్తున్నారని చెప్పడం సముచితం కాదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు ఎటువంటి ప్రణాళికా తన ప్రసంగంలో లేదని చెప్పారు. అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన రూట్ మ్యాప్ గవర్నర్ ప్రసంగంలో ఉంటే బాగుండేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నీ అసత్యాలే చెప్పించిందని తెలిపారు. దళిత బంధు ప్రస్తావన లేదన్నారు. మద్దతు ధరకు రూ. 500 కలిపి ధాన్యం కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది కదా! గవర్నర్ ప్రసంగంలో ఆ ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. దీన్ని బట్టే ఆ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి లేదని విమర్శించారు.

# ప్రజాస్వామికంగా పాలన అందించాలి

### - సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :

రాబోయే కాలంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామనీ, తమ పార్టీ ఆ బాధ్యతను నిర్వర్తిస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గానికి శుభాకాంక్షలు చెప్పారు. ఈనెల 12,13,14 తేదీల్లో మూడు రోజులపాటు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ సమావేశాలను హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపుల్లి సీతారాములు అధ్యక్షతన నిర్వహించారు.కేంద్ర పరిశీలకులుగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్ హాజరయ్యారు. శుక్రవారం తనను కలిసిన విలేకర్లతో తమ్మినేని మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు, పార్టీ అనుసరించిన ఎత్తుగడలు, ఫలితాలపై సమీక్షించామని చెప్పారు. తమ ఎత్తుగడలు సంతృప్తికరంగానే ఉన్నాయని అన్నారు. పోటీచేసిన 19 స్థానాల్లో గెలుస్తామని భావించకపోయినా ఓట్లు తక్కువ రావడం ప్రధాన



లోపంగా పార్టీ గుర్తించిందని వివరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు నిర్ణయం కాలయాపన కావడం, చివరి నిమిషంలో పొత్తు సాధ్యం కాదని తేలాక ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని చెప్పారు. సన్నద్ధం కావడానికి సమయం సరిపోని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయని వివరించారు. బీఆర్ఎస్ మీద కోపం ఉన్న వారు కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ మీద వ్యతిరేకత ఉన్న వారు బీఆర్ఎస్‌కు ఓటేశారని చెప్పారు. సీపీఐ(ఎం) పట్ల అభిమానం ఉన్న వారు కూడా తమకు ఓటేయలేదని అన్నారు. సీపీఐ(ఎం) కుటుంబాలే ఓటేశాయి తప్ప సంప్రదాయంగా వేసే అభిమానులు ఈసారి ఓటేయలేదని వివరించారు. పార్టీ కమిటీలు, శాఖల్లోనూ గణనీయంగా లోపాలు జరిగాయని అన్నారు. ఈ లోపాలను సమీక్షించుకుని భవిష్యత్తులో పార్టీని పటిష్టం చేయడానికి అవసరమైన నిర్ణయాలు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి వారంలోనే రెండు గ్యారంటీలను అమలు చేయడం శుభపరిణామమని తమ్మినేని చెప్పారు. వివిధ శాఖలపై సమీక్షలు, లోపాలను గుర్తించడం, వాటిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించడం సానుకూల సంకేతమని అన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి చేసిన వాగ్దానాలను అమలు జరపాలని కోరారు. ప్రజా స్వామికంగా పాలన అందించాలని సూచి ంచారు. అలా జరుగుతుందని ఆశిస్తున్నామని చెప్పారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215